వరాహావతారంలో భద్రాద్రి రామయ్య

వరాహావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న భద్రాద్రి రాముడు

భద్రాచలం, జనవరి 2 : ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి గురువారం వరాహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత స్వామివారిని ఆలయంలో వరాహావతారంలో అలంకరించి ప్రత్యేక ప్రజల అనంతరం నిత్య కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ పూజలు నిర్వహించి వేదపండితులు స్వామివారికి వేద విన్నపాలు సమర్పించారు. ఆ తర్వాత మిథిలా స్టేడియానికి మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొస్తుండగా దారి పొడవునా స్వామివారి రూపాన్ని తిలకించి భక్తజనం పులకించిపోయారు.

నేడు నరసింహావతారం..

ముక్కోటి వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం సీతారామచంద్రస్వామి నరసింహావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

వీకెండ్ అగ్రికల్చర్ రైతు కష్టాన్ని తెలియజేస్తుంది

సోంపల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో జీకేఎఫ్ టీం సభ్యులతో సంస్థ అధినేత పాషా

బూర్గంపహాడ్, జనవరి 2: వీకెండ్ అగ్రికల్చర్ రైతుల కష్టాన్ని తెలియజేస్తుందని జీకేఎఫ్ సంస్థ అధినేత ఎస్ కేఎం.పాషా అన్నారు. గురువారం మండల పరిధిలోని సోంపల్లి గ్రామంలో రైతుల వ్యవసాయ క్షేత్రాలను జేకేఎఫ్(గుడ్ నాలెడ్జ్ ఇన్ ఫామింగ్) టీం సభ్యులతో సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటి అనంతరం సభ్యులకు, వారితో పాటు వచ్చిన రైతులు, పలువురు ఉద్యోగులకు వీకెండ్ అగ్రికల్చర్‌పై అవగాహన కల్పించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థులు, కొన్ని ప్రైవేటు సంస్థల ఉద్యోగులకు వ్యవసాయం, రైతు కష్టం తెలిసేందుకు వీకెండ్ అగ్రికల్చర్‌ను జీకేఎఫ్ సంస్థ చేపట్టిందన్నారు. కార్యక్రమంలో జేకేఎఫ్ టీం సభ్యులు లక్ష్మీనారాయణ, సాబీర్, రజియా, లలిత, సరస్వతి, కృష్ణ, రవితేజ, శ్రీను, ప్రియాంక, సోంపల్లికి చెందిన రైతులు వెంకటరెడ్డి, పండగ రాములు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

పాల్వంచ రూరల్, జనవరి 2: మండలంలో శుక్రవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొంటారు. ఉదయం 10.00 గంటలకు యానంబైలు-జిన్నెగుట్ట హైలెవల్ వంతెనకు, పాండురంగాపురంలో ఎస్టీ ఆవాస ప్రాంతాలకు అనుసంధాన బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

పాల్వంచ రూరల్, జనవరి 2: ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బండ్రిగొండకు చెందిన యువ గొర్రెల కాపరి కంటే సంపత్‌కు, అదే గ్రామానికి చెందిన పాకాల వెంకటరావు సహా ఆయన మిత్రులైన మరో పదిమందికి మధ్య బుధవారం చిన్న విషయమై ఘర్షణ జరిగింది. సంపత్‌ను వెంకటరావు కొట్టి బెదిరించాడు. దీనిని తట్టుకోలేని సంపత్, గురువారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పాల్వంచ, కొత్తగూడెం ఆస్పత్రుల్లో కుటుంబీకులు చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంపత్ సోదరుడు భద్రయ్య ఫిర్యాదుతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఏబీ బర్దన్‌కు నివాళి

నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం అర్బన్, జనవరి 2: కమ్యూనిస్టు యోధుడు, సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి ఏబీ బర్దన్ 9వ వర్ధంతిని ఆ పార్టీ కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు క్యాంప్ కార్యాలయంలో నాయకులు గురువారం నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల 'బీర్' బాంబు నిర్వీర్యం

కొత్తగూడెం క్రైం, జనవరి 2: భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు అమర్చిన 'బీర్' బాంబును జవాన్లు నిర్వీర్యం చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ అడవుల్లో సీఆర్‌పీఎఫ్ 168 బెటాలియన్ సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. అక్కడి దుర్గ గుడి సమీపంలో మందు పాతరను గమనించారు. ఐఈడీ అమర్చిన బీరు బాటిళ్లను బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్ బయటకు తీసింది. వాటిని దూరంగా మైదాన ప్రాంతంలో నిర్వీర్యం చేసింది.

వాలీబాల్ టోర్నమెంట్

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఇల్లెందు రూరల్, జనవరి 2: మండలంలోని బొజ్జాయిగూడెంలో 11 మండలాల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ గురువారం యంగ్ తరంగ్ యూత్ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. నిర్వాహకులు కుంజ రాకేష్, కొడెం రమేష్, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

చుంచుపల్లి, జనవరి 2: నిజామాబాద్‌లో డిసెంబర్ 7 నంచి 9వ తేదీ వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ 68వ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని గుగులోత్ నిఖిత ప్రతిభ ప్రదర్శించింది. జాతీయ స్థాయి పోటీలకు తెలంగాణ జట్టు సభ్యురాలిగా ఎంపికైంది. ఆమెను హెచ్ఎం బాలాజీ, ఉపాధ్యాయులు లక్ష్మి, రాధ, రజియాసుల్తానా, కృష్ణవేణి, కవిత, వెంకటేశ్వర్లు, గణేష్ అభినందించారు.

పర్యాటకులను బంధువుల్లా ఆహ్వానించాలి

ఐటీడీఏ పీవో రాహుల్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

పర్యాటకులను ఆహ్వానించే తీరును గిరిజనులకు వివరిస్తున్న పీవో రాహుల్

దుమ్ముగూడెం, జనవరి 2: ముక్కోటి నేపథ్యంలో భద్రాచలం, పర్ణశాల వచ్చే భక్తులు, పర్యాటకులను మన ఇంటి బంధువుల్లా ఆహ్వానించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మండలంలోని పాత నారాయణరావుపేట, బొజ్జిగుప్ప గ్రామాల్లో పీవో పర్యటించారు. తొలుత నారాయణరావుపేటలో పర్యాటకుల కోసం తయారుచేస్తున్న ప్రదేశాలను ఆయన పరిశీలించి గ్రామ సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఏ విధంగా అతిథి మర్యాదలు చేస్తున్న విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత నారాయణరావుపేటలో ఆర్చరీ క్రీడాస్థలం, బొజ్జిగుప్పలోని బోటు షికారు ప్రాంతం పరిశీలించి ఆయన బోటుషికారు చేశారు. అనంతరం పంటలను పరిశీలించి పంటల సాగు తీరుపై రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచెలు, ఆర్చరీ, స్వాగత ద్వారాల నిర్మాణ ఏర్పాట్లు 5వ తేదీ నాటికి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింహారావు, జేడీఎం హరికృష్ణ, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరాస్వామి, ఐకేపీ ఏపీఎంలు హేమంతిని, సుకన్య, కిశోర్, నాగేశ్వరరావు, సెక్రటరీ స్రవంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంపునకు కృషి చేయాలి

భద్రాచలం, జనవరి 2: గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బోధిస్తున్న పాఠాలతో పాటు కంప్యూటర్‌లో పరిజ్ఞానం పెంపొందించుకునేలా హెచ్ఎంలు కృషి చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ పీఎంఆర్‌సీ భవనంలోని సమావేశ మందిరంలో ఏటీడీవోలు, పీజీహెచ్ ఎంలు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ల ఒక రోజు శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో ప్రతి పాఠశాలల్లో ఆన్‌లైన్ చదువులు ఇంటర్నెట్ ద్వారా బోధన జరిగే అవకాశం ఉన్నందున ప్రైమరీ స్కూల్ పిల్లల నుంచి మూడో తరగతి నుంచి తప్పనిసరిగా పూర్తిస్థాయిలో కంప్యూటర్ నాలెడ్జ్ సబ్జెక్టులకు సంబంధించి ప్రతి అంశం తెలిసేలా నేర్పించాలని సూచించారు. ప్రతి పాఠశాలకు 15 కంప్యూటర్లు అందిస్తామన్నారు. పాఠశాలల పర్యవేక్షణకు వచ్చినప్పుడు తప్పని సరిగా పిల్లలు కంప్యూటర్ గురించి అడిగితే ప్రతి అంశం చెప్పేలా నిష్ణాతులను చేయాలన్నారు. సమావేశంలో డీడీ మణెమ్మ, ఖమ్మం డీడీ విజయలక్ష్మి, ఏసీఎంవో రమణయ్య, రాములు, ఏటీడీవోలు అశోక్‌కుమార్, చంద్రమోహన్, రాధమ్మ, జహీరుద్దీన్, సత్యవతి, ఏవో నారాయణరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

చెన్నాపురం గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, జనవరి 2: గ్రామాల అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చెప్పారు. అశ్వారావుపేట మేజర్ పంచాయతీ అతి త్వరలోనే మున్సిపాలిటీ కానుందని చెప్పారు. ఆయన గురువారం మండలంలో పర్యటించారు. అశ్వారావుపేటలో డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. మున్సిపాలిటీగా ఏర్పాటవుతున్నందున పనులను త్వరగా పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. సెంట్రల్ లైటింగ్ పనుల్లో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించి, అశ్వారావుపేటను అందంగా తీర్చిదిద్దాలని కోరారు. దత్తత గ్రామం చెన్నాపురంలో సాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లతో చెప్పారు. నాయకులు జూపల్లి రమేష్, ప్రమోద్, ఆకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ డిజైన్ మారిస్తే ఉద్యమిస్తాం'

సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

జూలూరుపాడు, జనవరి 2: సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిర్మాణ డిజైన్‌ను మార్చడం ద్వారా నీటిని తరలించుకుపోతే రైతుల పక్షాన ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఎం స్థానిక కార్యాలయంలో గురువారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని సాగు భూములకు కాదని నీటిని తరలించేందుకు వినోభానగర్ సమీపం నుంచి సాగర్ కాల్వ వరకు కెనాల్‌ను ఆగమేఘాల మీద నిర్మిస్తున్నారని విమర్శించారు. దీనిని సీపీఎం వ్యతిరేకిస్తున్నదని అన్నారు. నాయకులు రేపాకుల శ్రీనివాస్, కొండపల్లి శ్రీధర్, యాసా నరేష్, గార్లపాటి వెంకటి, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు,ఈశ్వర్, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు సాయం

చెక్కు ఇస్తున్న బుజ్జి కన్నయ్య

టేకులపల్లి, జనవరి 2: ములకలపల్లి మండలానికి చెందిన ఉబ్బెన జోగరాజు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడు నిరుపేద. ఆయన వైద్య ఖర్చులకు పిండిపోలు రామయ్య సేవాసంస్థ తరపున రూ.25,000కు చెక్కును టేకులపల్లి మండలం బొమ్మనపల్లి విద్యుత్ ఏఈ పిండిపోలు బుజ్జి కన్నయ్య గురువారం అందించారు.

యుటీఎఫ్ డైరీ ఆవిష్కరణ

డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఈవో స్వామి

ఇల్లెందు రూరల్, జనవరి 2: మండలంలోని బాలికల జడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్‌లో యూటీఎఫ్ డైరీని ఎంఈవో టీవీఆర్ఎన్ స్వామి గురువారం ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి జయరాజు, హెడ్ మాస్టర్ ఎల్.రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చుంచుపల్లి, జనవరి 2: మండలంలోని గౌతంపూర్ కనకదుర్గ పరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ ముద్రించిన క్యాలెండర్‌ను సింగరేణి ఎస్ వోటు జీఎం కోటిరెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఏరియా సేఫ్టీ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారులు

మాట్లాడుతున్న పండూరి వీరబాబు

దమ్మపేట, జనవరి 2: మండలంలోని ప్రజాసమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని సీపీఐ-ఎంఎల్ (మాస్‌లైన్) నాయకుడు పండూరి వీరబాబు విమర్శించారు. పార్టీ స్థానిక కార్యాలయంలో గురువారం సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో సెంట్రల్ లైటింగ్ పనులను ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. డ్రైనేజీలను పట్టించుకోవడం లేదని, కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేవని, ఉన్న చోట దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు గంగాధర నాగమణి, జంజునూరి ముక్తేశ్వరి, ఎస్‌కె.ఆశ, మాధవి, అనిల్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సింగరేణి జీఎం శుభాకాంక్షలు

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న జీఎం

ఇల్లెందు రూరల్, జనవరి 2: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఆయన క్యాంప్ కార్యాలయంలో సింగరేణి ఏరియా జీఎం వీసం కృష్ణయ్య గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువా కప్పారు. డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సమ్మెబాట

సమ్మెలో పాల్గొన్న హమాలీ కార్మికులు

అశ్వాపురం, జనవరి 2: సివిల్ సప్లై జీసీసీ హమాలీ కార్మికులు ఎగుమతి, దిగుమతికి సంబంధించిన నూతన రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సివిల్ సప్లై జీసీసీ హమాలీ వర్కర్స్ యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జీసీసీ గోదాం వద్ద గురువారం సమ్మె చేపట్టారు. పాత రేట్ల ఒప్పందం ముగిసినందున నూతన రేట్లను అమలు చేయాలని కోరుతూ హమాలీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అనేక దఫాలుగా విన్నవించినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. వెంటనే పెరిగిన రేట్లను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు చిరునాగుల ఐలయ్య, లింగయ్య, ఉప్పలయ్య, కారం శ్రీను, లింగారెడ్డి, కనతాల అశోక్, మహేష్, వర్సా లక్ష్మణరావు, కాటిబోయిన శ్రీను, లింగయ్య పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం

దుమ్ముగూడెం,జనవరి 2: మండల కేంద్రమైన లక్ష్మీనగరం తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబంలో ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరుతో ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆళ్లపల్లి, జనవరి 2: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన ఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎట్టి నరేష్ నిత్యావసరాల కోసం మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. అదే గ్రామాని చెందిన కుంజా నవీన్ బైక్ వెళ్తుండగా గ్రామ సమీపంలోని లక్ష్మయ్య కుంటమోరి వద్ద అతి వేగంతో ఢీకొన్నాయి. ఎట్టి నరేష్ తీవ్ర గాయాలు కాగా, కుంజా నవీన్ తలకు గాయాలయ్యాయి. పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి 108 వాహనం ద్వారా మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుప్రతికి తరలించారు.

వెంకటాపురం గొత్తిగుంపులో హెల్త్‌క్యాంప్

వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సంఘమిత్ర

ఆళ్లపల్లి, జనవరి 2: మండల పరిధిలోని వెంకటాపురం గొత్తికోయగుంపులో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యురాలు సంఘమిత్ర గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో 49 మందికి వైద్యపరీక్షలు చేయగా ఇద్దరు జ్వరపీడితులను గుర్తించి, మిగత వారికి మందులు పంపిణీ చేశారు. హెచ్‌వీ రమాదేవి, హెల్త్ ఆసిస్టెంట్ నరేష్, ఏఎన్ఎం సుగుణ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల చోరీపై ఫిర్యాదు

- 'నమస్తే' ఎఫెక్ట్

అశ్వారావుపేట, జనవరి 2: మండల పరిషత్ కార్యాలయంలోని కుట్టు మిషన్ల చోరీపై ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ రెండు రోజుల కిందట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై యయాతి రాజు ప్రాథమిక విచారణ చేపట్టారు. నిరుపేద మైనార్టీ మహిళలకు ఉచితంగా పంపిణీ చేసేందుకు మండలానికి 83 కుట్టు మిషన్లను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ పేరుతో వాటిని అధికారులు పంపిణీ చేయలేదు. ఇవి చోరీ అయ్యాయి. దీనిపై 'మండల పరిషత్ కార్యాలయంలో దొంగలు పడ్డారు' శీర్షికన 'నమస్తే'లో ఇటీవల కథనం ప్రచురితమైంది. దీంతో, ఈ నెల 1న ఎస్సై యయాతి రాజుకు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాథమిక విచారణ చేపట్టినట్లు ఎస్సై యయాతి రాజు 'నమస్తే'తో చెప్పారు.

పెరిగిన ఆయిల్‌పాం గెలల ధర

అశ్వారావుపేట, జనవరి 2: ఆయిల్‌పాం గెలల ధర స్వల్పంగా పెరిగింది. గత ఏడాది నవంబర్ నెలలో టన్ను గెలల ధర రూ.20,413 ఉంది. ఇది డిసెంబర్ నెలకుగాను రూ.93 పెరిగి రూ.20,506కు చేరింది. ఈ పెరిగిన ధర, డిసెంబర్‌లో ఫ్యాక్టరీకి తరలించిన గెలలకు మాత్రమే వర్తిస్తుందని ఆయిల్‌ఫెడ్ అధికారులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

టేకులపల్లి, జనవరి 2: యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. బోడు ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు.. మండలంలోని గంగారం పంచాయతీ మిట్టపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన బాలిక(15)పై లైంగిక దాడికి సంపత్‌నగర్ గ్రామ యువకుడు మాలోత్ శివ యత్నించాడు. ఆ బాలిక తల్లి ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో కేసును ఎస్సై పి.శ్రీకాంత్ నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

అశ్వారావుపేట రూరల్, జనవరి 2: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కన్నాయిగూడెం గ్రామస్తుడు తోడెం పూర్ణచంద్రప్రసాద్, బుధవారం అశ్వారావుపేట వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా, రామన్నగూడెం గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అశ్వారావుపేటలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారిపై బాలుడు లైంగిక దాడి

అశ్వారావుపేట, జనవరి 2: చిన్నారిపై బాలుడు లైంగిక దాడి చేశాడు. ఎస్సై యయాతిరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారిని, ఆటోలో తిప్పి తీసుకొస్తానంటూ అదే గ్రామానికి చెందిన బాలుడు(17) బుధవారం ఆటోలో తీసుకెళ్లాడు. గ్రామ శివారులోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. ఆ తర్వాత, చిన్నారిని ఇంటి వద్ద దించేసి వెళ్లాడు. ఆ చిన్నారి ఏడ్చుకుంటూ ఇంట్లోకి వచ్చింది. ఆమెను తల్లి గమనించి, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు. చిన్నారిని ఆసుపత్రిలో చేర్పించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

4న ఖమ్మంలో కళాకారుల ఎంపిక

బూర్గంపహాడ్/రామవరం, జనవరి 2: ప్రముఖ సినీగేయ రచయిత, వాగ్గేయకారుడు ప్రజాకవి వరంగల్ శ్రీనివాస్ రచించిన 'నూరేళ్ల నా ఊరు' గేయకావ్యం 243 చరణాలతో 243 మంది గాయనీ, గాయకులచే పాడించాలనే సంకల్పంతో కళాకారుల ఎంపిక కార్యక్రమాన్ని ఈ నెల 4న ఖమ్మంలోని అంబేద్కర్ భవనంలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రముఖ కళాకారుడు తోకల రవిప్రసాద్,గాయకుడు కొంకటి కృష్ణ గురువారం తెలిపారు.

4న సీజ్ చేసిన ఇసుకకు వేలం

బూర్గంపహాడ్, జనవరి 2: మండల పరిధిలోని ఉప్పుసాక గ్రామంలో డిసెంబర్ 31న కిన్నెరసాని నది ఒడ్డున సీజ్ చేసిన ఇసుకను జనవరి 4న తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ముజాహిద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 4న సాయంత్రం 3 గంటలకు కార్యాలయం ఆవరణలో వేలం జరుగుతుందని, ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

వేధింపుల కేసు నమోదు

ఆళ్లపల్లి, డిసెంబర్ 2: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తిపై వేధింపుల కేసు నమోదైనట్లు ఎస్సై రతీష్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఓ మహిళను, అదే గ్రామానికి చెందిన మహమ్మద్ తోహిద్ తరచూ వెంటపడి వేధిస్తున్నాడు. గ్రామ పెద్దలకు విషయం తెలుపగా హెచ్చరించినా పద్దతి మరక పోవడంతో సదరు మహిళ ఫిర్యాదు మేరకు తోహిద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భద్రాద్రి వంతెనపై రక్షణ వలయం ఏర్పాటు చేయాలి

బూర్గంపహాడ్, జనవరి 2: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాద్రికి నిత్యం వందలాది మంది భక్తులు దర్శనానికి వస్తుంటారని, ఈ క్రమంలో భద్రాచలం-సారపాకకు అనుసంధానంగా ఉన్న గోదావరి వంతెన ఆత్మహత్యలకు నిలయంగా మారిందని, ఈ వంతెనపై రక్షణ వలయం ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా నాయకులు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన సారపాకలో మాట్లాడుతూ.. వంతెనకు ఇరువైపులా ఐదు అడుగుల ఎత్తులో ఇనుపకంచె, సీసీ కెమెరాలు అమర్చితే ఆత్మహత్యలను పూర్తిస్థాయిలో నివారించవచ్చన్నారు.

మొక్కజొన్న సాగుపై రైతుల ఆసక్తి

చండ్రుగొండ, జనవరి 2: మండలంలోని ఎక్కువమంది రైతులు యాసంగిలో రెండో పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రధానంగా పోకలగూడెం, తిప్పనపల్లి, దామరచర్ల, బెండాలపాడు,గుర్రాయిగూడెం, గానుగపాడు, తుంగారం గ్రామాల్లోని రైతులు సుమారు వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

చండ్రుగొండ, జనవరి 2: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. మండలంలోని తిప్పనపల్లి పంచాయతీ మహ్మద్ నగర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో కోడి పందేల స్థావరంపై గురువారం రాత్రి ఎస్సై శివరామకృష్ణ ఆధ్వర్యంలో దాడి చేశారు. ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రెండు కోడి పుంజులను, రూ.3,000 స్వాధీనపర్చుకున్నారు. కేసును ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 2: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ములకలపల్లి మండలం నల్లమూడి గ్రామ సమీపంలో గురువారం కోడి పందేల స్థావరంపై ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. రూ.3,070, మూడు సెల్‌ఫోన్లు, రెండు కోడి పుంజులు, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనపర్చుకున్నారు. నలుగురు జూదరులపై ఎస్సై కేసు నమోదు చేశారు.

సెల్ ఫోన్ అప్పగింత

ఇల్లెందు, జనవరి 2: మున్సిపల్ కార్మికురాలు బి.నాగమణి, గురువారం ఉదయం కొత్త బస్టాండ్ వద్ద విధులకు వెళ్లి, ఒకచోట తన సెల్ ఫోన్‌ను పెట్టి మర్చిపోయి